పెండింగ్‌లో బిల్లులు.. అసంపూర్తిగా పనులు

- రూరల్ మండలంలో నిలిచిన ప్రభుత్వ బడుల అభివృద్ధి పనులు
- పట్టించుకోని అధికారులు


సారంగాపూర్ ఉన్నత పాఠశాలలో పిల్లర్ల దశలోనే నిలిచిన డైనింగ్ హాల్ నిర్మాణం

నిజామాబాద్ రూరల్: మండల పరిధిలోని ప్రభుత్వ బడుల్లో అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచాయి. మండలంలోని ఆయా బడులకు మన ఊరు–మన బడి కార్యక్రమం కింద నిధులు కేటాయించినా, పూర్తిస్థాయిలో బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే నిలిపివేశారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

మండలానికి రూ.కోటిపదిహేను లక్షల నిధులు..

రూరల్ మండలంలోని ప్రభుత్వ బడుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు– మన బడి పథకం కింద దాదాపు రూ.కోటి పదిహేను లక్షల నిధులు కేటాయించింది. ఈమేరకు ఆయా పాఠశాలలకు సంబంధించి అభివృద్ధి పనులు చేపట్టడానికి కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్మాణాలు ప్రారంభించారు. కాని బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే నిలిపివేశారు. కొన్ని పాఠశాలల్లో పూర్తి అయిన పనులకు బిల్లులు మంజూరు కాక కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని తిర్మన్‌పల్లి పాఠశాలకు సుమారు రూ.37 లక్షలు మంజూరు కాగా, దాదాపు రూ.10లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. బడిలో పెండింగ్ ఎలక్ట్రీసిటీ పనులు చేపట్టారు. డైనింగ్ హాల్, లెంటర్ లెవల్ వరకు పూర్తయ్యాయి. మిగిత పనులు చేపట్టాల్సి ఉంది. సారంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.38 లక్షలు మంజూరు కాగా రూ.12 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. విద్యార్థులకు వాష్‌రూంల నిర్మాణం, డైనింగ్‌హాల్ నిర్మాణాలు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. కాలూర్ జెడ్పీ హైస్కూల్‌లో రూ.40 లక్షలు మంజూరు కాగా రూ.13లక్షలు పెండింగ్ ఉన్నాయి. అలాగే పలు బడుల్లో పూర్తయిన పనులకు ఎంబీ రికార్డు అయిన బిల్లులు మంజురు కాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్లు అధికారుల చుట్టూ తిరుగుతూ తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని బడులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను విడుదల చేసి, అభివృద్ధి పనులను పూర్తి చేయించాలని విద్యార్థులు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన పాఠశాల పైకప్పు



సారంగాపూర్ పాఠశాల

ఎంబీ రికార్డు చేసి పెట్టాం..

మండలంలోని ప్రభుత్వ బడుల్లో అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంలేదని ఆవేదన చెందుతున్నారు. బడుల్లో మన ఊరు–మన బడి కింద చేపట్టిన పనులకు ఎంబీ రికార్డులు చేసి పెట్టాం.కానీ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు. అవి వచ్చాకనే మిగిలిన పనులు చేపడతామని కాంట్రాక్టర్లు చెబుతున్నారు.దీంతో పాఠశాలలో పనులు అసంపూర్తిగా మిగిలాయి. నిధులు మంజూరు కాగానే పనులను పూర్తిచేయిస్తాం. –మారుతి, ఏఈ, రూరల్

కోర్టు తీర్పును తక్కువ చేసి మాట్లాడటం సరికాదు


నగరంలో భట్టి విక్రమార్క దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు

సుభాష్‌నగర్: 'రోహిత్ వేముల కేసు' విషయంలో కోర్టు తీర్పును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తక్కువ చేసి మాట్లాడటం సరికాదని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఆర్ శివప్రసాద్ అన్నారు. గౌరవప్రదమైన పదవిలో ఉండి ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా, బీజేపీపై డిప్యూటీ సీఎం మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం నగరంలోని పులాంగ్ చౌరస్తాలో బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో భట్టి విక్రమార్క దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ.. కోర్టు తీర్పును అంగీకరించని నేతలు అధికారంలో ఉండటం చాలా ప్రమాదకరమన్నారు. ఎఫ్ఐఆర్‌లో లేని వారి పేర్లు, వారే కారణమని చెప్పడం దుర్మార్గమని విమర్శించారు. ఈ చర్యలను బీజేపీ ఎస్సీ మోర్చా తీవ్రంగా ఖండిస్తుందన్నారు. లేనిపోని ఆరోపణలు చేసిన భట్టి విక్రమార్క వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు సందీప్, దాసారం కుమార్, దేవర్ సంజు, సాయివర్ధన్, బాలకృష్ణ, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో అన్యాయం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్‌నాగారం: బాసర ట్రిపుల్ ఐటీ సీట్ల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అన్నారు. బడుగు బలహీనవర్గాలందరూ ఏకమై ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పై పోరాడాలని పిలుపునిచ్చారు. నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌పై సమీక్ష అవసరం అన్నారు. విద్యా, ఉద్యోగాలలో అన్ని వర్గాల కన్న ఈడబ్ల్యూఎస్ వారు తక్కువ మార్కులతో అవకాశాలు పొందుతుంటే ఇక బహుజన వర్గాల బతుకులు ఘోరమవుతాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సోదరులందరు ఏకమై ఈ దోపిడీని ముక్త కంఠంతో ఎదిరించి పోరాడాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుస్స ఆంజనేయులు, నగర అధ్యక్షుడు దర్శనం దేవేందర్, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యాడ శంకర్ , పోల్కం గంగాకిషన్, విజయ్, బాలన్న, సదానంద్, విజయ్ పాల్గొన్నారు

నెలకు రూ.19 వేల వేతనం ఇవ్వాలి


డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్‌లో వాటర్ సెక్షన్, శానిటేషన్ జవాన్లకు నెలకు రూ.19వేల వేతనం ఇవ్వాలని బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ బీఎల్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఆయన జిల్లా కేంద్రంలోని డిప్యూటీ లేబర్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు రావలసిన పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. దీంతో కార్మికుల తరపున కేసు వేసినట్లు తెలిపారు. అధికారులు ఇదేవిధంగా వ్యవహరిస్తే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు మేకల రాజేందర్, మురళి, గోపాల్, లక్ష్మన్, సంతోష్ గౌడ్, మోహన్ గౌడ్, సాయిలు, వినోద్, కిరణ్, బాబు, ప్రశాంత్, యూసుఫ్, రాజు పాల్గొన్నారు.

సమాచారం..

నగరంలో బోనాల ఉత్సవాలు

నిజామాబాద్‌అర్బన్: నగరంలో మంగళవారం టీఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా పాత కలెక్టరేట్ ఆవరణలోని నవదుర్గా మాత ఆలయంలో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు, కలెక్టర్, సీపీ తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం అన్ని అంశాల్లో విఫలం



సిరికొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని అంశాల్లో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ రూరల్ ఇన్‌చార్జి బాజిరెడ్డి జగన్ ఆరోపించారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని సరిగ్గా అమలు చేయడం లేదని తెలిపారు. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు అల్లాడుతున్నారన్నారు. సన్న వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి చెల్లించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తున్నదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీతో కుమ్మక్కై ఉందని, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి చేసిన రాజీనామాతో వెల్లడైందన్నారు. నాయకులు సంతోష్‌రెడ్డి, రాజన్న, నర్సారెడ్డి, భూషణ్‌రెడ్డి, సురేందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

19న అరుణోదయ రాష్ట్ర సదస్సు

నిజామాబాద్ సిటీ: ఖమ్మం జిల్లాలోని ఇల్లెందులో ఈనెల 19న అరుణోదయ రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి దాసు తెలిపారు. జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ హక్కుల రక్షణకై కొట్లాడదాం, ఆదివాసులకు అండగా నిలుద్దామన్న పిలుపుతో సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సదస్సుకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో కవులు, కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు సురేష్ బాబు, అబ్దుల్, రమేష్, గోపాల్, నరసయ్య, పోశెట్టి, దేశెట్టి సాయరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



సుభాష్‌నగర్: నగరంలోని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డు శ్రద్ధానంద్ గంజ్‌లో సోమవారం గుమస్తా సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక వర్గం ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని సూచించారు. అనంతరం గుమస్తా సంఘం నూతన కార్యవర్గం ముప్ప గంగారెడ్డిని సన్మానించింది. సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ అపర్ణ, గ్రేడ్–3 సెక్రెటరీ మధుసూదన్, గుమస్తా సంఘం అధ్యక్షుడు లాండరి బాల అంజయ్య, ఉపాధ్యక్షుడు ఆమంద్ రాజ్ గణేష్, ప్రధాన కార్యదర్శి గట్ల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి శివకుమార్, కోశాధికారి కొండ వెంకటేశం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మారుతీ మల్లేష్, సెల్లార్ కమిటీ అధ్యక్షుడు తోట దేవేందర్, ప్రధాన కార్యదర్శి హన్మంతు, కోశాధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ జెమ్స్ ..



నిజామాబాద్ నాగారం: నగరంలో ఆదివారం రాత్రి రోటరీ క్లబ్ జెమ్స్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ డీజీపీ అనురాగశర్మ హాజరై, నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా పాకాల నరసింహరావు, కార్యదర్శిగా గంజి రమేష్, కోశాధికారిగా పాల్తి రంజిత్‌కుమార్, బోర్డు మెంబర్స్ ప్రమాణ స్వీకారం చేశారు. రోటరీ మాజీ గవర్నర్ హనుమంత్ రెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ జైపాల్ రెడ్డి, నిజామాబాద్, ఆర్మూర్, కామారెడ్డి సభ్యులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



డిచ్‌పల్లి: కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నేడు కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు కోరారు. సిగాచి ఫార్మా కంపెనీ ప్రమాద మృతులకు న్యాయం చేకూర్చాలని, క్షతగాత్రులకు రూ.50లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలనే డిమాండ్లతో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిగాచి ఫార్మా కంపెనీ నిబంధనలు ఉల్లంఘించి కార్మికుల ప్రాణాలను బలి తీసుకుందని విమర్శించారు. ఇలాంటి ఘటనలు తిరిగి కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు జేపీ గంగాధర్, పోశెట్టి, శాంసన్, సుధాకర్, శివ, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



సిరికొండ: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల మహిళ సంఘం(పీవోడబ్ల్యూ) నిజామాబాద్ రూరల్, కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు పిట్ల రమ డిమాండ్ చేశారు. మండలంలోని గడ్కోల్ గ్రామంలో సోమవారం నిర్వహించిన పీవోడబ్ల్యూ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వర్షాకాలంలో అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేస్తున్నాయని దుయ్యబట్టారు. డివిజన్ కార్యదర్శి పుష్పలత, గంగామణి, సావిత్రి, లిఖిత, విజయ, బాలలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	99,000	వెండి(కిలో)	1,17,500
22 క్యారెట్స్	91,390	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	70	పచ్చిమిర్చి	60	90
బీరకాయ	40	70	దోసకాయ	20	40
దొండకాయ	30	60	ఆలుగడ్డ	25	50
బీర్నీసుకాయ	80	120	గోబిగడ్డ	10	20
కాకరకాయ	40	60	గోబిపువ్వు	40	70
వంకాయ	40	60	బీట్‌రూట్	30	60
పాలకూర	30	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	35	60
కొత్తిమీర	30	50	చిక్కుడుకాయ	45	75
పుదీనా	60	90	గోరుచిక్కుడు	30	60
క్యాప్సికం	50	90			

–సుభాష్‌నగర్

సంక్షిప్తం

జిల్లా పద్మశాలి సంఘం సభ్యత్వానికి రాజీనామా

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ జిల్లా పద్మశాలి సంఘానికి, జిల్లా వధూవరుల పరిచయ వేదిక ఆర్గనైజింగ్ సెక్రెటరీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు భీమర్తి రవి (అలిశెట్టి) సోమవారం ప్రకటించారు. జిల్లాలోని సంఘాలను ఏకతాటిపైకి తీసుకురావడానికి, అందరూ ఐక్యంగా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. తన రాజీనామా లేఖను ఆమోదించాలని జిల్లా అధ్యక్షుడు నరసింహులును కోరారు.

సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలి

మోపాల్: మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై సుస్మిత అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆమెను కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆమెను సన్మానించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. అందరి సహకారంతో మండలంలో శాంతి భద్రతలను కాపాడుతానన్నారు. నాయకులు గంగాప్రసాద్, ప్రతాప్‌సింగ్, సతీష్‌రెడ్డి, తూర్పు రాజేష్, సవీన్‌రెడ్డి, కాల్పోల్ వంశీ, శ్రావణ్, సంతోష్‌రెడ్డి, మల్లయ్య, సవీన్‌రెడ్డి ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



మోపాల్: మండలంలోని మంచిప్పలో పలు బాధిత కుటుంబాలకు సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూర్పు రాజేష్ పంపిణీ చేశారు. వీడీసీ చైర్మన్ వెంకట్రామ్, నాయకులు గుండుగల శ్రీనివాస్, గోవూరి భూపతి, ముత్యంరెడ్డి, మహేష్‌రెడ్డి, భాస్కర్, దేవిదాస్, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ మండలంలో..



సిరికొండ: మండలంలోని కొండాపూర్, తూంపల్లి గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలకు సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. నాయకులు బుచ్చన్న, శ్రీధర్, సంతోష్‌నాయక్, జీవన్, ఫారూఖ్, రాజేశ్వర్‌గౌడ్, లక్ష్మణ్, బాలరాజ్‌నాయక్, హరీష్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, శ్రీకాంత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు ప్రారంభం

మోపాల్: మండలంలోని కంజర్ శివారులో ఏర్పాటు చేసిన టీబీహెచ్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకును సోమవారం రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బీన్ హందాన్, నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి ప్రారంభించారు. పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, నాయకులు గుత్ప రఘు, కంపెనీ ప్రతినిధులు, బంకు యజమాని, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్‌నాగారం: తన పంట భూమిని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డొంకేశ్వర్ మండలం గాదేపల్లి గ్రామానికి చెందిన మహిపాల్ రెడ్డి కోరారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. 1129 సర్వేనెంబర్‌లో 5 ఎకరాల ఏడు గుంటల భూమి తన పేరుపై ఉందన్నారు. కానీ ఆ భూమి పక్కన ఉన్న మోతే రమణ, మోతే గంగారెడ్డిలకు సంబంధించిన కుటుంబ సభ్యులతో పాటు బద్దం మల్లారెడ్డి, గంపల కళ్యాణ్ కుటుంబ సభ్యులు తన పంట భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారిపై అధికారులకు ఫిర్యాదు చేయడంతో తమపై అక్రమ కేసులు బనాయిస్తూ కుటుంబసభ్యులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన చెందారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సిరికొండ: మండలంలోని కొండాపూర్, తూంపల్లి, రావుట్ల, పెద్దవాల్గోట్, సర్పల్లితండాలో పలు బాధిత కుటుంబాలను సోమవారం బీఆర్ఎస్ నిజామాబాద్ రూరల్ ఇన్‌చార్జి బాజిరెడ్డి జగన్ పరామర్శించారు. పలువురికికి ఆర్థికసాయం అందజేశారు. నాయకులు తోట రాజన్న, శ్రీనివాస్, భూషణ్‌రెడ్డి, సురేందర్, రఘువాస్, మహేందర్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టుకార్డు ఉద్యమనేతకు ఘన స్వాగతం

నిజామాబాద్‌నాగారం: కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫోటో ముద్రించాలని పోస్ట్‌కార్డు ఉద్యమం చేపడుతున్న జక్రిపోతుల పురుషోత్తం సోమవారం నగరానికి విచ్చేయగా మాల మహానాడు నాయకులు ఘన స్వాగతం పలికారు. మాల మహానాడు ప్రతినిధులు గైని గంగారం, ఇత్వార్‌పేట్ లింగన్న, జనార్దన్ జిన్నా, సక్కి విజయ్ కుమార్, సక్కి ప్రభంజన్, బంగారు సాయిలు, పులి జైపాల్, సక్కి చంద్రశేఖర్, శివ పాల్గొన్నారు.

చెత్త సేకరణ వందశాతం జరగాలి


నగరంలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంహెచ్‌వో రవిబాబు.. కార్మికుల హాజరు తనిఖీ చేస్తూ..

- ఇన్‌చార్జి ఎంహెచ్‌వో రవిబాబు
- నగరంలో పారిశుద్ధ్య పనుల పరిశీలన

నిజామాబాద్ సిటీ: నగరంలో ప్రతి నిత్యం చెత్త సేకరణ వందశాతం జరగాలని, పరిసరాలను చెత్త లేకుండా శుభ్రంగా ఉంచాలని నగర మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఎంహెచ్‌వో రవిబాబా కార్మికులకు సూచించారు. నగర మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను సోమవారం ఆయన పరిశీలించారు. జిల్లాకేంద్రంలోని అర్సపల్లిలోని జోన్–5 కార్యాలయంలో పారిశుద్ధ్య సిబ్బంది హాజరును పరిశీలించారు. కార్మికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరాన్ని శుభ్రంగా ఉంచాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, జవాన్లు వెంకటస్వామి, మహేష్ తదితరులు ఉన్నారు.

కారును మరిచారు.. మొరం పోశారు..


మహాలక్ష్మి నగర్‌లో రోడ్డుపక్కన మొరంలో కూరుకుపోయిన కారు

నిజామాబాద్ సిటీ: నగరంలోని వినాయక్‌నగర్ లోగల మహాలక్ష్మినగర్‌లో ఇటీవల సీసీ రోడ్డు పనులు చేపట్టారు. కానీ సంబంధిత గుత్తేదారు రోడ్డుపక్కన మట్టిని పూడ్చేపనిలో మాత్రం నిర్లక్ష్యం వహించారు. ఓ ఇంటి యజమాని రోడ్డుపక్కన కారును నిలిపి ఉంచగా, గుత్తేదారు, సంబంధిత అధికారులు కారును కదపకుండా దాని చుట్టూ మట్టి పోసి మమ అనిపించుకున్నారు. దీంతో కారు కొంతమేర మట్టిలో కూరుకుపోగా ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ దృశ్యాన్ని రోడ్డువెంట వెళ్లేవారు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈ ఘటనపై 'సాక్షి' వివరణ కోసం ప్రయత్నం చేయగా, సదరు కారు యజమాని, కాంట్రాక్టరు అందుబాటులోకి రాలేరు.

ఆధ్యాత్మికం

వినాయక ఆలయాల్లో ప్రత్యేక పూజలు


శుభం కరోతి గణపతి


మహాగణపతి ఆలయంలో..

నిజామాబాద్ రూరల్: నగరంలోని వినాయకుడి ఆలయాల్లో సోమవారం సంకష్టహర చతుర్థి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సార్వజనిక్ గణేష్ మండలి గణపతి ఆలయం, మహాగణపతి దేవాలయం, సిద్ధివినాయక స్వామి ఆలయం, శుభం కరోతి గణపతి ఆలయం, లక్ష్మీగణపతి మహా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గరిక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్లు భూషన్‌చారి, మచ్చ చంటయ్య, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


గాయత్రినగర్ గణపతి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

18న 'ఆవేదన సభ'


ఎమ్మెల్యే ధన్‌పాల్‌తో మాట్లాడుతున్న సుజాత

సుభాష్‌నగర్: నగరంలోని లక్ష్మి కళ్యాణ మండపంలో ఈనెల 18న వికలాంగుల పెన్షన్ పెంపు, ఆసరా, చేయూతదారుల పెన్షన్ పెంపు కోసం 'ఆవేదన సభ' నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పెద్దసంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. నగరంలోని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణను సోమవారం ఆమె కలిసి వినతిపత్రం అందజేశారు. సభకు పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. నాయకులు సరికెల పోశెట్టి, మైలారం బాలు, పెద్దోళ్ల యమున, శీలం యాదగిరి, కృష్ణవేణి, తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



జక్రాన్‌పల్లి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి అన్నారు. మండలంలోని నారాయణపేట పాఠశాలలో సోమవారం సంఘ సభ్యత్వ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. త్వరలో పెండింగ్ బిల్లులు ఒక్కొక్కటిగా మంజూరు అవుతాయన్నారు. జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగోని కిషన్, ఎంఈవో శ్రీనివాస్, హెచ్ఎంలు లింగన్న, శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రతినిధులు మామిడి గోపి, రవీన్, గట్ల కిషన్, వినోద్, కాషగౌడ్, ప్రతాప్‌రెడ్డి, రమణారెడ్డి, అంకం నరేష్, గంట అశోక్ ఉన్నారు.

విద్యుత్‌ను ఆదా చేయాలి



జక్రాన్‌పల్లి: అన్నదాతలు విద్యుత్‌ను ఆదా చేయాలని డిచ్‌పల్లి డీఈ రమేష్ అన్నారు. మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో సోమవారం పడకల్ సెక్షన్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. పడకల్ ఏఈ భాస్కర్, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.